ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు : గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY 5
మహబూబ్‌నగర్ జిల్లా వార్తలు
శనివారం 9 ఆగస్టు 2025



డేంజర్ డెంగీ
- రోజురోజుకూ పెరుగుతున్న బాధితులు
- జనవరి నుంచి 97 కేసులు నమోదు
- పట్టణ ప్రాంతాల్లోనే అత్యధికంగా వ్యాప్తి

7



బాలానగర్‌లోనే.. నవోదయ

పాఠశాల ఏర్పాటుకు శాశ్వత స్థలం గుర్తింపు

- ఉత్తర్వులు జారీ
- బాలానగర్, గండీడ్‌లో స్థలాల పరిశీలన.. అనువైన ఎంపిక
- జూలై 14న తరగతులు ప్రారంభించాలని నిర్ణయం..
- నేటికీ అందని ఉపాధ్యాయులు, సిబ్బంది కేటాయింపు.. విద్యార్థుల జాబితా
- బండమీదిపల్లిలో తాత్కాలికంగా భవనం కేటాయింపు

మహబూబ్‌నగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది రాష్ట్రానికి కొత్తగా ఏడు జవహర్ నవోదయ విద్యాలయాలను మంజూరు చేసిన విషయం తెలిసిందే. అందులో మహబూబ్‌నగర్‌లో కూడా ఒక నవోదయ విద్యాలయం ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2024 డిసెంబరు 6న ఉత్తర్వులు వచ్చాయి. శాశ్వత భవనం ఏర్పాటు చేసే వరకు సంవత్సరంపాటు తరగతులు కొనసాగించడానికి తాత్కాలికంగా పాలమూరు యూనివర్సిటీ సమీపంలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం భవనాన్ని కేటాయించారు. కానీ శాశ్వత భవనం కోసం స్థలం ఎంపిక పూర్తయితే మాత్రమే తాత్కాలిక భవనంలో నవోదయ విద్యాలయ సమితి పాఠశాలను కొనసాగించడానికి అనుమతులు వస్తాయి. జిల్లా అధికారులు, నవోదయ విద్యాలయ సమితి స్థలం ఎంపిక పరిశీలన బృందం జిల్లాలో మూడు అనువైన స్థలాలను గుర్తించారు. అందులో ఒకటి గండీడ్ మండలం సల్కర్‌పేటలో కాగా.. మరొకటి బాలానగర్ మండలం పెద్దపల్లిలో ఎన్‌హెచ్ 167కు సమీపంలో ఒకటి, ఎన్‌హెచ్ 44కు సమీపంలో మరొకటి గుర్తించారు. రెండు అనువైన ప్రదేశాలే.. అయితే వీటిని ఎంపిక చేయడానికి కేంద్రానికి నివేదిక పంపించగా.. అటు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తన నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని, ఇటు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వారి వారి నియోజకవర్గాల్లోనే ఏర్పాటు చేయాలని భీష్మించుకున్నారు. నవోదయల్లో కొనసాగుతున్న వారికి జూన్‌లోనే తరగతులు ప్రారంభం అయ్యాయి. కొత్త పాఠశాలల్లో ఆరో తరగతి ప్రవేశాలు పూర్తయినప్పటికీ.. జూలై 14న తరగతులు ప్రారంభించాలని స్కూల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ యోగితా రాణా ఆధ్వర్యంలో జరిగిన హై లెవల్ మీటింగ్‌లో నిర్ణయించారు. అయితే ఇప్పటివరకు తరగతులు మాత్రం ప్రారంభం కాలేదు. స్థల ఎంపిక మాత్రమే అడ్డంకి కాగా.. ఎట్టకేలకు నవోదయ విద్యాలయ సమితి కోసం బాలానగర్ మండలంలోని పెద్దపల్లిలో 20 ఎకరాలను ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటివరకు తాత్కాలిక భవనంలో తరగతులు కొనసాగుతాయని పేర్కొంది.



నవోదయ పాఠశాల నిర్వహణ కోసం పాలమూరు యూనివర్సిటీ సమీపంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన భవనం

రెండు స్థలాలను అనువుగా గుర్తించగా..

పాఠశాల నిర్మాణం కోసం 20 ఎకరాల స్థలం కేటాయింపు పూర్తయ్యింది. బాలానగర్ మండలానికి ఇప్పటికే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ మంజూరు కాగా.. శంకుస్థాపన కూడా చేశారు. ఇప్పుడు అక్కడే నవోదయ విద్యాలయం ఏర్పాటు చేసేందుకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. బాలానగర్‌లో ప్రస్తుతం బాలికల గురుకుల పాఠశాల కొనసాగుతోంది. జాతీయ రహదారిపై ఉండటం, ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉండటం, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చొరవతో పాఠశాల మంజూరు కావడంతో బాలానగర్ మండలం విద్యాహబ్‌గా మారనుంది.

స్థల సేకరణ పూర్తయితేనే..

కేంద్ర ప్రభుత్వం నవోదయ విద్యాలయాల ఏర్పాటు విషయంలో శాశ్వత భవనాలకు స్థల సేకరణను ముఖ్యంగా భావిస్తుంది. తాత్కాలిక ఏర్పాట్లు చేసినప్పటికీ.. శాశ్వత భవనాలకు స్థలం ఓకే అయితేనే ఒక సంవత్సరంపాటు ఆ తాత్కాలిక భవనంలో తరగతులు కొనసాగించడానికి అనుమతులు ఇచ్చే నిబంధనలు పెట్టుకున్నట్లు సమాచారం. ఒకవేళ శాశ్వత భవనానికి స్థలం ఎంపికలో వివాదాలు తలెత్తితే విద్యార్థులకు ఇబ్బంది అవుతుంది కదా అనేది దీని ఉద్దేశం. అయితే నవోదయ విద్యాలయం కోసం 25 ఎకరాల నుంచి 30 ఎకరాల స్థలం అవసరం అవుతుంది. ఇందులోనే విద్యార్థుల తరగతి గదులు, గ్రౌండ్, హాస్టల్ వసతి, సిబ్బంది నివాసాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

సిబ్బంది కేటాయింపు కాలే..

నవోదయ పాఠశాల మంజూరై 2025-2026 విద్యా సంవత్సరం నుంచే తరగతులను ప్రారంభించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు ఇప్పుడు శాశ్వత స్థలం కూడా ఫైనల్ అయ్యింది. తాత్కాలికంగా పాలమూరు యూనివర్సిటీ వద్ద ఉన్న దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. విద్యార్థుల తరగతి గదులు, హాస్టళ్లు, స్టాఫ్ ఉండేందుకు ఏర్పాట్లు.. తదితర వసతులు తాత్కాలికంగా కల్పించారు. జూన్‌లో ప్రారంభం కావాల్సిన తరగతులు ఇప్పటివరకు కాలేదు. కొత్తగా మంజూరైనవి

(మిగతా 6లో..)

యంత్రసాయం

- వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద సబ్సిడీపై పనిముట్ల అందజేత
- దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు
- రైతులు కోరుకున్న కంపెనీలవే అందజేసేందుకు ఏర్పాట్లు
- నారాయణపేట జిల్లాకు 3,377 యూనిట్లకు రూ.272.47 కోట్లు కేటాయింపు



ట్రాక్టర్‌తో దున్నుతున్న రైతు

నారాయణపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా సబ్సిడీపై అందిస్తున్న పనిముట్ల కోసం రైతుల నుంచి దరఖాస్తూలు స్వీకరిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రూపొందించిన ఈ పథకంలో పలు సవరణలు చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి పథకాన్ని వర్తింపచేసేందుకు ప్రభుత్వం నారాయణపేట జి ల్లాకు 3,377 యూనిట్లుకు రూ. 272.47 కోట్లు కేటాయించింది. అందులో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు భరించనున్నా యి. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీ ఇవ్వనుండగా, జనరల్ కేటగిరీ రైతులకు 40 శాతం సబ్సిడీ వర్తిస్తుంది. పథకం అమలుపై కలెక్టర్ సిక్తాపట్నాయక్, వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారులు, ఏఈవోలకు దిశా నిర్దేశం చేశారు.

15తో ముగియనున్న గడువు

పథకం కింద ఈ నెల 5వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుండగా, 15తో గడువు ముగియనుంది. గతంలో చేసుకున్న దరఖాస్తులతో పాటు కొత్త దరఖాస్తులను కూడా పరిశీలిస్తారు. కలెక్టర్ ఈ నెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పరిశీలిస్తారు. దరఖాస్తులు తిరస్కరిస్తే అందుకు గల కారణాలను రైతులకు తెలియజేస్తారు. 21 నుంచి 27 వరకు ఎంపికైన రైతుల నుంచి డీడీలు తీసుకుంటారు. 27 నుంచి సెప్టెంబరు 5వ తేదీ వరకు మంజూరు పత్రాలు అందిస్తారు. సెప్టెంబరు 7 నుంచి 17 వరకు రైతులకు పనిముట్లు అందిస్తారు. కూలీల కొరత ఉండటంతో రైతాంగానికి చేయూత ఇవ్వడం కోసం ప్రభుత్వం సబ్సిడీ పనిముట్లను అందించనుంది. రైతులు కోరుకున్న కంపెనీ పనిముట్లనే ఇవ్వనున్నారు.

జిల్లాకు వివిధ కేటగిరీల కింద మంజూరైన యూనిట్లు, నిధుల వివరాలు

పనిముట్ల రకం	యూనిట్లు	నిధులు (రూ.లక్షల్లో)
బ్యాటరీ ఫూట్ మ్యానువల్ ఆపరేటెడ్	2822	28.22
పవర్ ఆపరేటెడ్ స్ప్రేయర్స్	485	48.5
ట్రాక్టర్ డ్రాగన్	137	68.5
ఇంప్లిమెంట్స్ రోటోవేటర్		
సీడ్‌కామ్ ఫర్టిలైజర్ డ్రిల్ మిషన్	32	9.6
డిస్క్ కేజీవిల్స్ రోటో ప్ల్యూడర్	179	35.8
బున్ ఫార్మర్ గటేవే	9	1.37
పవర్ వీడర్	17	5.95
బ్రెష్ కట్టర్	33	11.55
పవర్ టిల్లర్స్	25	25.00
హార్వెస్టింగ్ స్ట్రా బాలర్స్	38	38.00
మొత్తం పనిముట్ల యూనిట్లు	3777	272.47

కళ్లల్లో కారం కొట్టి దారి దోపిడీ
- రూ.3లక్షలు దోచుకెళ్లిన దుండగులు
- నక్కలబండ తండా వద్ద ఘటన

6

ఎత్తిపోతలకు వ్యతిరేకం కాదు
- న్యాయమైన పరిహారం ఇవ్వాలి

7

హై..హై.. నాయకా!



- ఎన్నికల వేళ గల్లీల్లో రాజకీయ సందడి
- ఒక్కో డివిజన్‌లో ఆరేడుగురు అభ్యర్థులు
- ప్రజల మన్ననలను పొందేందుకు పాట్లు

6

కలకలం

- ఆంధ్రజ్యోతి కథనంపై సర్వత్రా చర్చ
- తమ సంతకాల ఫోర్జరీపై పంచాయతీ కార్యదర్శుల ఆందోళన
- గాధిర్యాల్ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసిన కార్యదర్శి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మహమ్మదాబాద్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గ్రామ కార్యదర్శుల సంతకాలు ఫోర్జరీ చేసి, నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి ఒకరి ఇంటిపై మరొకరికి రుణాలు ఇప్పించడంపై ఆంధ్రజ్యోతిలో 'ఇల్లు ఒకరిది.. లోన్ మరొకరిది' అన్న శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనం మహమ్మదాబాద్ మండలంలో కలకలం సృష్టించింది. ప్రైవేట్ బ్యాంకుల నుంచి ఇంటి రుణాల కోసం పలు గ్రామాల్లో గ్రామ కార్యదర్శుల సంతకాలను ఫోర్జరీ చేసినట్లు గాధిర్యాల్, చౌదర్‌పల్లి, మంగంపేట, మహమ్మదాబాద్ తదితర గ్రామాల్లో పార్టీల నాయకులు, ప్రజలు చర్చించుకున్నారు. నా సంతకాలు ఫోర్జరీ చేసి, నకిలీ పత్రాలు సృష్టించి ఓ ప్రైవేట్ హౌసింగ్ సొసైటీ బ్యాంకులో రుణాలు పొందినట్లు గాధిర్యాల్ గ్రామ కార్యదర్శి మహమ్మద్ హాజీ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. పంచాయతీ అధికారులకు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అప్రమత్తమైన కార్యదర్శులు

తమపై ఒత్తిడి చేసి, నిబంధనలకు విరుద్ధంగా వారికి అవసరం ఉన్న సర్టిఫికెట్స్ ఇవ్వాలని అడుగుతున్నారని, ఇవ్వకుంటే సంతకాలను ఫోర్జరీ చేస్తున్నారని పలువురు కార్యదర్శులు చెబుతున్నారు. కొందరు నాయకులు దౌర్జన్యాలకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకరు ఇంటి లోన్ సర్టిఫికెట్ అడిగితే ఇవ్వలేదని, నువ్వు ఇవ్వకుంటే తామే తయారు చేసుకుంటామని, ఏం చేస్తవో చేసుకో అంటూ బెదిరించారని మండల పరిధిలోని ఓ గ్రామ కార్యదర్శి తెలిపారు. అతను ఇంటిపై రుణం కూడా తీసుకున్నారని సమాచారం ఉందని ఆయన 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. మరి కొందరు నాయకులు తనకు తెలియకుండా ఇందిరమ్మ ఇళ్ల లోకేషన్ ఎలా తీసుకుంటావ్ అంటు బెదిరిస్తున్నారని చెబుతున్నారు. పలువురు అధికార పార్టీ నాయకులు ప్రతీ విషయానికి ఒత్తిడి చేస్తున్నారని కార్యదర్శులు చెబుతున్నారు. ఇది తమ ప్రభుత్వమని, తాము చెప్పినట్లు వినకుంటే వెళ్లిపోవాలని బూతు మాటలు తిడుతూ, బెదిరింపులకు దిగుతున్నారని వాపోతున్నారు.

వరలక్ష్మీ శోభ





వ్రతాలు చేస్తున్న భక్తులు



రేణుక ఎల్లమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



రేణుక ఎల్లమ్మ ఆలయంలో నాగులకు పూజలు చేస్తున్న భక్తురాలు

వరలక్ష్మీ వ్రతంతో మహబూబ్‌నగర్ జిల్లాలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నది. భక్తులు ఉదయమే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లకు వ్రతాలు, అభిషేకాలు నిర్వహించారు. దాంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

\- మహబూబ్‌నగర్ న్యూ టౌన్ (ఆంధ్రజ్యోతి)

అనుబంధాల రాఖీ



- నేడు రక్షా బంధన్
- కొనుగోళ్లతో కిటకిటలాడిన దుకాణాలు



మహబూబ్‌నగర్‌లో రాఖీలు కొంటున్న మహిళలు



విక్రయానికి ఉంచిన రాఖీలు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అక్కా తమ్ముళ్లు, అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పౌర్ణమి(రక్షబంధన్) వేడుకలను జిల్లాలో శనివారం జరుపుకోడానికి సిద్ధమౌతున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన రాఖీల దుకాణాల వద్ద మహిళలు క్యూ కట్టారు. పాన్ చౌరస్తా, రాంమందిర్ చౌరస్తా, గడియారం చౌరస్తా, న్యూటౌన్ చౌరస్తా, పద్మవతి కాలనీ, భగీరథ కాలనీ, టీచర్స్ కాలనీలలో ప్రత్యేకంగా రాఖీల షాపులు వెలిశాయి. రూ.10 నుంచి రూ.250 వరకు ధరల్లో వివిధ రకాల డిజైన్లలో రాఖీలు అందుబాటులో ఉన్నాయి. అన్న, తమ్ముడు పేర్లతో ఉన్న రాఖీలు ఆకట్టుకున్నాయి. వెండి రాఖీలను సైతం విక్రయించారు.



పాన్ చౌరస్తాలో రాఖీలు కొంటున్న మహిళలు

తండ్రిని చంపిన తనయుడు

- 30 గుంటల భూమికోసం దారుణం
- పోలీసుల అదుపులో నిందితుడు

నవాబ్‌పేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ పొలం తన పేరున చేయలేదని తండ్రిని తనయుడి హత్య చేసిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కామారం గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. నవాబ్‌పేట ఎస్‌ఐ విక్రం కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చిలుకల కృష్ణయ్య(45) 2015లో తాను కట్టుకున్న భార్యను కడతేర్చి జైలుకు వెళ్లి ఏడాది క్రితం తిరిగి వచ్చాడు. కుమారుడు వెంకటేష్‌తో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. గ్రామ శివారులోని సర్వేనెంబర్ 174 లో కొంత పొలం విక్రయించాడు. మిగిలిన 30 గుంటల భూమిని తనపేరిట పట్టా అమలు చేయాలని కుమారుడు తండ్రిని ఇబ్బందులకు గురి చేసేవాడు. ఇదేవిషయమై శుక్రవారం తెల్లవారుజామున తండ్రీకొడుకులు గొడవ పడ్డారు. ఇంట్లో ఉన్నకర్రలతో దాడి చేసి అనంతరం రోకలి బండతో తలపై మోదడంతో తండ్రి రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతూ ప్రాణాలు వదిలాడు. జరిగిన విషయమై నిందితుడు తన బాబాయిలకు సమాచారం ఇచ్చాడు. గ్రామస్థులు, బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి అన్న చెన్నయ్య ఫిర్యాదుతో నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ గాంధీ నాయక్, ఎస్‌ఐ విక్రం తెలిపారు.



శ్రీరాముడికి నైవేద్యం.. మారుతి స్వీకారం

శ్రీరామ చంద్రుడికి భక్తులు సమర్పించిన నైవేద్య ఫలాన్ని మారుతి స్వీకరించింది. ఓ కోతి సీతా, రామ, లక్ష్మణ విగ్రహాల చెంత అచ్చం ఆంజనేయుడిలా కూర్చొని స్వామికి సమర్పించిన ఫలహారాలను ఆరగించి వెళ్లిపోయింది. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మునిసిపాలిటీలోని 9వ వార్డులో ఉన్న శ్రీసీతారామ, లక్ష్మణ, సంజీవరాయ దేవాలయంలో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కింది.

\- భూత్పూర్, ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు.
మహబూబ్‌నగర్ : 9985411175, 9985403259
నాగర్‌కర్నూల్ : 9985410905
వనపర్తి : 9985403242
గద్వాల : 9985403238
నారాయణపేట : 9985411463
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9985411365

కుటుంబ కలహాలు..

భార్య ఎదుటే ఉరి వేసుకుని భర్త ఆత్మహత్య



రాజేంద్ర రెడ్డి (ఫైల్)

జగ్గయ్యపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల వల్ల భార్యపై కోపంతో ఆమె కళ్లెదుటే భర్త ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలోని కోదాడ రోడ్డులో కోర్టు సమీపంలో జరిగింది. గురువారం సాయంత్రం ఈ సంఘటన జరగ్గా శుక్రవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు రావటంతో వెలుగులోకి వచ్చింది. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా కొత్తకోట మండలం పాలెం గ్రామానికి చెందిన మండ్ల రాజేంద్రరెడ్డి (35) స్థానిక ప్రైవేట్ ఫ్యాక్టరీలో కొంత కాలం, మరికొంత బోర్‌వెల్స్ పనిచేశాడు. రాజేంద్ర రెడ్డికి కొద్ది నెలల క్రితం జగ్గయ్యపేట మండలం గండ్రాయి గ్రామానికి చెందిన పూజిత (18)తో వివాహమైంది. కోర్టు ఎదురుగా ఒక ఇల్లు అద్దెకు తీసుకుని కాపురం ఉంటున్నారు. గత కొంతకాలంగా భార్య ఫోన్ ఎక్కువగా మాట్లాడుతోందనే అనుమానంతో తరచు గొడవలు పడుతున్నారు. గురువారం ఈ విషయమై ఇద్దరు కీచులాడుకుంటుండగా, సాయంత్రం భార్య బయటకు వెళ్లిన సమయంలో బియ్యం బస్తా మీద నిలబడి ఫ్యాన్‌కు ఉరేసుకునే ప్రయత్నం చేస్తుండగా, గమనించిన పూజిత వారించే ప్రయత్నం చేసింది. గండ్రాయిలో ఉన్న సోదరుడికి ఫోన్ చేసి చెప్పగా, అతడు వచ్చి తలుపులు పగలగొట్టి లోపలకు వెళ్లాడు. రాజేంద్రను హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్టు చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా పాలెంలో ఉంటున్న రాజేంద్రరెడ్డి తండ్రి వెంకటరెడ్డి కోడలిపై అనుమానం వ్యక్తం చేసి ఫిర్యాదు చేశారు. రాజేంద్ర రెడ్డి ఆత్మహత్య చేసుకునే దృశ్యాలన్ని ఇంట్లో ఉన్న సీసీ ఫుటేజ్‌లో రికార్డు అయ్యాయి. వాటిని జగ్గయ్యపేట ఎస్సై జి.రాజు పరిశీలిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్సై చెప్పారు. భౌతికకాయానికి జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రిలో పోస్ట్‌మార్టమ్ నిర్వహించి తండ్రికి అప్పగించారు.

కళ్లల్లో కారం చల్లి దారి దోపిడీ

- రూ.3లక్షలు దోచుకెళ్లిన దుండగులు
- నక్కలబండతండా వద్ద ఘటన

జడ్చర్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని దుండగులు అడ్డుకొని రూ.3 లక్షలు దోచుకెళ్లారు. ఈ సంఘటన జడ్చర్ల, మహబూబ్‌నగర్‌ల మధ్య నక్కలబండతండా వద్ద గురువారం అర్ధరాత్రి జరిగింది. జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన అరుణ్‌రెడ్డి, జడ్చర్ల న్యూబస్టాండు సమీపంలోని రిడి వైన్స్‌లో క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. గురువారం రాత్రి 10:30 గంటల సమయంలో రూ.3 లక్షలు, దుకాణం తాళాలను తన వద్ద నున్న బ్యాగ్‌లో ఉంచుకొని, ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరాడు. నక్కలబండతండా వద్ద మోపెడ్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు అతడిని అడ్డగించారు. కళ్లల్లో కారం చల్లి, అతడి వద్ద ఉన్న బ్యాగును లాక్కొని, జడ్చర్ల వైపు పారిపోయారు. వెంటనే తేరుకున్న అరుణ్‌రెడ్డి వారిని వెంబడించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ కమలాకర్ తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

- మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్



బిజినేపల్లిలో అనాథ శవాన్ని అంత్యక్రియలకు మోసుకెళ్తున్న పోలీసు కానిస్టేబులు జితేందర్ నాయక్

బిజినేపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి ఓ కానిస్టేబుల్ మానవత్వాన్ని చాటుకున్నాడు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలం, వట్టెం (వెంకటాద్రి) రిజర్వాయర్‌లో ఈ నెల 6న గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. రెండు రోజులు గడిచినా అతడికి సంబంధించిన వారు ఎవరూ రాలేదు. దీంతో కానిస్టేబుల్ జితేందర్‌నాయక్ ముందుకొచ్చాడు. స్వంత డబ్బు ఖర్చు చేసి పాడె కట్టి కొందరి సాయంతో మోసుకెళ్ళి అంత్యక్రియలు నిర్వహించాడు. ఆయనను ఎస్‌ఐ కె.శ్రీనివాస్ అభినందించారు.

బాలానగర్‌లోనే.. నవోదయ

(5వ పేజీ తరువాయి)

కాబట్టి కొంత ఆలస్యం కావొచ్చు. కానీ ఎప్పుడో ఏర్పాట్లు పూర్తి చేసినప్పటికీ.. రెండు నెలల నుంచి తరగతులు ప్రారంభం కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. 40 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించగా.. వారంతా ఇతర పాఠశాలల్లోనూ చేరలేదు. అయితే విద్యార్థుల జాబితా ఇంకా రాలేదు. జాయినింగ్ రిపోర్టు కూడా కాలేదు. అసలు తాత్కాలిక వసతిలో పని చేయడానికి ఉపాధ్యాయుల కేటాయింపు, సిబ్బంది నియామకం కూడా జరగలేదు. అయితే దీనంతటికీ శాశ్వత స్థలం ఎంపిక ఆలస్యం కావడమే కారణమని అభిప్రాయం వస్తోంది. ఇప్పుడు అది కూడా పూర్తి అయినందున.. త్వరితగతిన సిబ్బందిని కేటాయించి, తరగతులను ప్రారంభం చేయాల్సిన అవసరం ఉంది. లేకపోతే విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి ఉంటుంది.

విద్యారంగంలో జడ్చర్లకు మరో మైలురాయి

జడ్చర్ల(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో జడ్చర్ల నియోజకవర్గం మరో మైలురాయి దాటిందని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని బాలానగర్ మండలం పెద్దాయిపల్లి వద్ద జవహర్ నవోదయ పాఠశాలను మంజూరు చేస్తూ నవోదయ విద్యాలయ సమితి ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. పెద్దాయిపల్లి వద్ద ఇప్పటికే రూ.150 కోట్లతో ఏర్పాటు చేసే ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు కాగా, జడ్చర్ల మండలం మల్లెబోయిన్‌పల్లి వద్ద ఐఐటీ కళాశాల సైతం మంజూరైందని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ కు ధన్య వాదాలు తెలిపారు.

విద్యార్థుల జాబితా రాలేదు

మహబూబ్‌నగర్ జిల్లాకు నవోదయ పాఠశాల మంజూరైంది. జిల్లా కేంద్రంలోని బండమీదిపల్లిలో అధికారులు భవనం, తరగతుల కోసం ఏర్పాటు చేశారు. కానీ విద్యార్థుల ఎంపిక జాబితా ఇంకా రాలేదు. ఉపాధ్యాయులు, సిబ్బంది ఎంపిక కూడా కాలేదు. పాఠశాలకు సంబంధించి స్థల సేకరణ పూర్తయితేనే అన్నివిధాల అనుమతులు వస్తాయి. బాలానగర్ మండలంలోని పెద్దపల్లిలో స్థలం ఎంపిక చేస్తూ నవోదయ విద్యాలయ సమితి ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలోనే అన్ని రకాల అనుమతులు వచ్చి, తరగతులు ప్రారంభమవుతాయి.

- భాస్కర్ కుమార్,
ప్రిన్సిపాల్, వట్టెం నవోదయ పాఠశాల

హై.. హై..నాయకా..!

- ఎన్నికల వేళ గల్లీల్లో రాజకీయ సందడి
- ఒక్కో డివిజన్‌లో ఆరేడుగురు అభ్యర్థులు
- ప్రజల మన్ననలను పొందేందుకు పాట్లు



మహబూబ్‌నగర్ నగరం

మహబూబ్‌నగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : మీ గల్లీలో మోరీ జామ్ అయిందా ? పైపులు పగిలిపోయాయా? నీళ్ళు నిలిచిపోవడంతో దోమల బెడద పెరిగిందా? నల్లా నీళ్ళు రాలేదా ? కుక్కలు, పందుల బెడద ఎక్కువగా ఉందా? పరేషాన్ కాకుండ్రి.. మేమున్నాం.. అంటూ పలువురు నాయకులు ప్రజలకు భరోసా ఇస్తున్నారు. సమస్యను పరిష్కరిస్తాం అంటూ ఆ ప్రాంతానికి సంబంధించిన ఏఈ లేదంటే శానిటరీ ఇన్‌స్పెక్టర్, జవాన్‌లకు ఫోన్ చేస్తున్నారు.

తాను ఫలానా నాయకుడి మనిషినని, అన్న చెప్పిండు వెంటనే పని కావాలంటూ సందడి చేస్తున్నారు. ఈ చోటా నాయకులు గల్లీ గల్లీల్లో సందడి చేస్తుండగా.. ఆ హంగామాతో అధికారులు, సిబ్బంది బేజారవుతున్నారు. గతంలో కౌన్సిలర్లు ఉన్నపుడు ఆయా వార్డుల నుంచి ఒక్కరే ఫోన్లు చేసేవాళ్లు.. ఇప్పుడు వాళ్ల పదవి కాలం అయిపోవడంతో గల్లీలో అందరూ లీడర్లు అయిపోయారు. పాలమూరు కార్పొరేషన్‌లోని దాదాపు అన్ని డివిజన్లలో ఇదే పరిస్థితి నెలకొన్నది. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న అధికార, విపక్ష పార్టీల నాయకులందరూ ఉదయం నుంచే గల్లీల్లో తిరుగుతున్నారు.

స్థానికులను పలుకరిస్తూ, యోగక్షేమాలు తెలుసుకుంటున్నారు. పని లోపనిలోగా ఏమైనా సమస్యలున్నాయా అని ఆరా తీస్తున్నారు.

ఒక్కో డివిజన్‌లో ఆరేడుగురు

కౌన్సిలర్ల పదవీకాలం ముగిసి 6 నెలలు దాటుతోంది. 49 వార్డులున్న చోట 60 డివిజన్లు ఏర్పాడ్డాయి. దీంతో అన్ని డివిజన్లలో కొత్త నాయకులు పుట్టుకొస్తున్నారు. ఒక్కో డివిజన్‌లో ఆరేడుగురు పోటీ పడుతున్నారు. అధికారపార్టీలో ఈ పోటీ మరీ ఎక్కువగా ఉంది. టికెట్ తనకే వస్తుందన్న ధీమాతో సిట్టింగ్‌లు ఓ వైపు డివిజన్లలో పర్యటిస్తున్నారు. కొత్త నాయకులు పలువురు తమకే టికెట్ వస్తుందన్న ధీమాతో గల్లీల్లో తిరుగుతున్నారు. ఇటీవల జరిగిన బోనాల ఉత్సవాల్లోనూ ఈ నాయకులు హంగామా చేశారు. ప్రజలకు కావలసిన ఏర్పాట్లను తామే దగ్గరుండి చూస్తూ, వారి దృష్టిని ఆకర్షించేందుకు యత్నాలు చేశారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన కౌన్సిలర్లు ఉన్నచోట, అధికార పార్టీకి చెందిన వారు ఎక్కువ దృష్టి సారిస్తున్నారు. తమ పార్టీ అధికారంలో ఉన్నందున గెలిచేది తామే అన్నట్లుగా ప్రచారం చేసుకుంటున్నారు.



ప్రజా సమస్యల పరిష్కారం కోసం..

అధికార పార్టీలో టికెట్ ఖాయం అనుకున్న ముఖ్య నాయకులు కొందరు ఇప్పటికే వార్డు పర్యటనలు చేస్తున్నారు. గల్లీల్లో ప్రధాన సమస్యలను ముఖ్య నేతల దృష్టికి తీసుకెళ్లి, అధికారుల ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కొత్తగా చేపట్టబోయే సీసీరోడ్లు, డ్రైనేజీల వంటి పనులపై హామీలు ఇస్తున్నారు. ఇక కొత్తగా తయారైన నాయకులు చేస్తున్న హంగామాతో అధికారులకు తలనొప్పులు తప్పడం లేదు. గల్లీల్లో ఇళ్ళ మధ్య చెట్ల పొదలు పెరగడం, కుక్కల బెడద, నీళ్ళు నిల్వ ఉండటం, పైప్‌లైన్ల లీకేజీలు, తాగునీరు సక్రమంగా సరఫరా కాకపోవడం, వీధిలైట్లు వెలగకపోవడం, దోమల మందు కొట్టించడం వంటి పనులపై పోటాపోటీగా అధికారులకు ఫోన్లు చేస్తున్నారు. తాము చెబితేనే పని అయ్యిందని ప్రజల మన్ననలను పొందేందుకు సిబ్బందిని పరుగులు పెట్టిస్తున్నారు. ఒక గల్లీ నుంచి ఒకరైతే పర్వాలేదని, కానీ ఒకరి తరువాత ఒకరు ఐదారు గురు ఫోన్లు చేస్తుండటంతో తల పట్టుకోవాల్సి వస్తుందని అధికారులు చెప్తున్నారు. నగరపాలక సంస్థ ఎన్నికలు జరగడానికి మరో 6 నెలలు పట్టే అవకాశం ఉండగా, ఇప్పుడే ఎన్నికలు వస్తున్నట్లు అన్ని పార్టీలకు చెందిన కొత్త నాయకులు చేస్తున్న హంగామా అంతా ఇంతా కాదు.

దుందుభీ పరుగులు

- పెరిగిన నది ప్రవాహం
- వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతుల పరిస్థితి అగమ్యగోచరం
- సిర్సవాడ, మాదారం గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు



సిర్సవాడలో క్రమేపి పెరుగుతున్న దుందుభీ నది ప్రవాహం

తాడూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : నిన్న రాత్రి ఎగువన కురిసిన భారీ వర్షాల కారణంగా దుందుభీ నది ప్రవాహం శుక్రవారం పరుగులు పెడుతోంది. గత నెల 23న కురిసిన నిరంతర వర్షాలతో దుందుభి నది ప్రవాహం పది రోజుల పాటు నిరంతరాయంగా కొనసాగింది. గత ఐదు రోజులుగా శాంతించిన దుందుభీ నది ప్రవాహం మళ్లీ గురువారం రాత్రి ఎగువ ప్రాంతాల్లో పరుగులు పెడుతోంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని రాజాపూర్, బాలానగర్, నవాబ్‌పేటతో పాటు జడ్చర్ల, మిడ్జిల్, నాగర్‌కర్నూల్ జిల్లాలోని తిమ్మాజిపేట, తాడూరు, ఊర్కొండ మండలాల్లో కురిసిన వర్షాల కారణంగా దుందుభీ ప్రవాహం ఉరకలేస్తున్నది. అయితే ఉదయం నుంచి సాధారణ స్థితిలోనే నది ఉన్నప్పటికీ అకస్మాత్తుగా మధ్యాహ్న 2గంటల ప్రాంతంలో తీవ్రత పెరిగింది. దీని మూలంగా దుందుభి నది అవతలి భాగంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్న రైతులు, రైతు కూలీల పరిస్థితి, పశువుల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. దీంతో రైతులు, రైతు కూలీలు నది ప్రవాహం పెరుగుతున్న సమాచారంతో ఎక్కడి పనులు అక్కడే వదులుకుని ఇళ్లల్లోకి చేరుకునే పరిస్థితి నెలకొంది. మరికొంత మంది నది ప్రవాహ తీవ్రత పెరగడం మూలంగా దాటేందుకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ఆటోలు కిరాయికి తీసుకుని మేడిపూర్ హైలెవల్ వంతెనపై నుంచి దాదాపు 40కిలో మీటర్లు ప్రయాణించి ఇంటికి చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అదే విధంగా దుందుభీ నదిలోని కాజ్‌వే ప్రతినిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఈ క్రమంలోనే అకస్మాత్తుగా వరద ప్రవాహం పెరగడం మూలంగా వాహనాలన్నీ దుందుభీ నది వద్దకు వచ్చి తిరుగు ప్రయాణం చేయాల్సి వచ్చిందని పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు సిర్సవాడ వద్ద ఉన్న లోలెవల్ కాజ్‌వేపై హైలెవల్ వంతెన నిర్మించే ప్రక్రియను వేగవంతం చేయాలని నది పరివాహక ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

పాలమూరులో భారీ వర్షం

- జడ్చర్లలో అత్యధికంగా 123 మిల్లీమీటర్ల వర్షపాతం

మహబూబ్‌నగర్/గద్వాల/వనపర్తి టౌన్/నారాయణపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) :ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవ డంతో చెరువులు, కుంటలు, వాగులు, వంపులు జలకళను సంతరించు కున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్లలో అత్యధికంగా 123 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. జిల్లా వ్యాప్తంగా సగటున 50 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పలు మండలాల్లో కురిసిన కుండపోత వర్షానికి కుంటలు, చెక్‌డ్యామ్‌లు అలుగులు పారాయి. శుక్రవారం సాయంత్రం వరకు సాధారణంగా ఉన్న వాతావరణం సాయంత్రం మే ఘావృతమై వర్షం కురిసింది. జడ్చర్లలో 123.8, రాజాపూర్‌లో 96.1, అడ్డాకులలో 81.2, బాలానగర్‌లో 74, భూత్పూర్‌లో 65.5, నవాబ్‌పేటలో 68.1, మూసాపేటలో 59.7, సీసీకుంటలో 55.2, కౌకుంట్లలో 53.6, మ హబూబ్‌నగర్ అర్బన్‌లో 47.4, మహ్మదాబాద్‌లో 37.6, మహబూబ్ నగర్ రూరల్‌లో 30.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలో 90.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నర్వలో 38.3, ఊట్కూర్‌లో 34.8, మక్తల్‌లో 29.8, మద్దూర్‌లో 20.4, నారాయణపేటలో 19.2, మరికల్ మండలంలో 18.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలో 83.1, పెద్దమందడిలో 13.5 మిల్లీమీటర్ల వర్షం పడింది. జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలిలో 40.6, గద్వాలలో 22.1, మానవపాడులో 21.9, ఉండవెల్లిలో 20.7, కేటీదొడ్డిలో 18, ఎర్రవల్లిలో 17, వడ్డేపల్లిలో 16.8, మల్దకల్, అలంపూర్‌లో 14.1 మి ల్లీమీటర్ల వర్షం కురిసింది.

అక్రమ రుణాల కేసులో..

మరో ఇద్దరికి రిమాండ్

- డీఎస్పీ వెంకటేశ్వరరావు



విలేకరుల సమావేశంలో నిందితులను ప్రవేశపెట్టి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

వనపర్తి రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : నకిలీ ధ్రువపత్రాలతో ఒకే ఇంటిపై మూడు, నాలుగు సార్లు అక్రమంగా రుణాలు తీసుకున్న కేసులో మరో ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2007 నుంచి కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బండారు రాకేశ్.. రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి దిగి ఇళ్లు కట్టి విక్రయించడం ప్రారంభించాడు. తదనంతరం హరీశ్‌కుమార్, తాళ్లపల్లి మల్లేష్, సందీప్, బుక్క కిషోర్ కుమార్, సుంకరి శేఖర్ అనే వ్యక్తులతో ముఠాగా ఏర్పడి నకిలీ పత్రాలతో బ్యాంకులను మోసం చేయడానికి పథకం రచించాడు. ఒకే ఇంటిపై ఒకే సారి, మూడు, నాలుగు రుణాలు తీసుకొని బ్యాంకుల ను మోసం చేశారు. ఇలా పోలీసు శాఖకు చెందిన భద్రతా స్కీంతో పాటు, ఐవోబీ, హెచ్‌డీఎఫ్‌సీ, ఎల్‌ఐసీల నుంచి మొత్తం రూ.2,61,89,000 రుణం తీసుకున్నారు. సంఘటనపై భద్రత స్కీం ఏవో కృష్ణ మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, మూడు రోజుల క్రితం ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు త రలించారు. తాజాగా నిందితుడు రాకేశ్ భార్య దేవరశెట్టి మమతతో పాటు, మరో కానిస్టేబుల్ శ్రీకాంత్‌రెడ్డిలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు.

సెల్యూట్ చేస్తున్నాం

- ఉమ్మడి జిల్లాలోనే అచ్చంపేట బీఆర్ఎస్ కార్యకర్తలు గ్రేట్
- ఆత్మీయ సమ్మేళనంలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

అచ్చంపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పార్టీ అంటే నాయకులు కాదు కార్యకర్తలు అని నిరూపించిన అచ్చంపేట బీఆర్ఎస్ శ్రేణులకు సెల్యూట్ చేస్తున్నామని ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు అన్నారు. మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పార్టీ వీడిన సందర్భంగా శుక్రవారం ఆ పార్టీ కార్యకర్తలకు మనోధైర్యాన్ని నింపేందుకు శుక్రవారం అచ్చంపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనానికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. బీఆర్ఎస్ పార్టీ మీదకాని కేసీఆర్ మీద కోపంతో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లు వేయలేదని, ఎన్నికల ముందు ఆ పార్టీ ఇచ్చిన వాగ్దానాలు, ప్రలోభాలతో మోసపోయి గెలిపించారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. కార్యకర్తలు మనోధైర్యంతో ముందుకెళ్లాలన్నారు. మీ స్ఫూర్తికి పాదాభివందనం చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో విద్యుత్‌కోతలు, ఎరువులకు క్యూలైన్లు, సాగునీటి సమస్యలతో కష్టాలు ఎదురవుతున్నాయని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఎవరూ మనోధైర్యం కోల్పోవద్దని కార్యకర్తలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్‌మనకు శ్రీరామ రక్ష అయితే కేసీఆర్ మనందరికీ అండ అని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లాలోనే అచ్చంపేట కార్యకర్తలు చైతన్యవంతులన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం ప్రజలకు సేవచేసేందుకు రాజకీయాల్లోకి వచ్చానని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్ అన్నారు. అచ్చంపేటలో ఇటీవల బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన నాయకుడు తనపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడారన్నారు. ఒక రకంగా బాధగా మరో రకంగా సంతోషంగా ఉందన్నారు. ఏది జరగకూడదో అదే జరిగిందని.. కార్యకర్తలు నికార్సుగా ఆయన వెంట వెళ్లకుండా బీఆర్ఎస్ జెండా పట్టుకున్నారని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అన్నారు. ఏ కార్యకర్తకు ఆపద వచ్చినా నాకు ఫోన్ చేయాలని కార్యకర్తలను తన నెంబర్లు ఇచ్చారు. మీ అందరిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అంటే కార్యకర్తలని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు మనోహర్, మునిసిపల్ మాజీ చైర్మన్లు నర్సింహగౌడ్, తులసీరాం, మాజీ ఎంపీపీ పర్వతాలు, నాయకులు మాకం తిరుపతయ్య, గోపాల్ రెడ్డి, రవీందర్ రావు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ బస్సుల పేరుతో అదనపు చార్జీలు



హైదరాబాద్ నుంచి నారాయణపేటకు ఎక్స్‌ప్రెస్ స్పెషల్ బస్సు పేరిట రూ. 360 చార్జి టికెట్

నారాయణపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : వరలక్ష్మీ వ్రతం, రాఖీ పౌర్ణమిలను పుర స్కరించుకొని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపించింది. కానీ అదనపు చార్జీలు వసూలు చేయడంలో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. హైద రాబాద్ నుంచి నారాయణపేటకు ఎక్స్‌ప్రెస్ చార్జి సాధారణ రోజుల్లో రూ.230 ఉండేది. ప్రత్యేక బస్సు పేరుతో రూ. 360 వసూలు చేశారు. ఒకే సారి రూ. 130 అదనంగా వ సూలు చేయడంపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. అలాగే మహబూబ్‌నగర్ నుంచి నారాయణపేటకు ఎక్స్‌ప్రెస్ చార్జి రూ.110 ఉండగా, రూ.140 వసూలు చేశారు. ప్రత్యేక బస్సుల పేరుతో అదనపు చార్జీలు వసూలు చేయడం సరికాదని ప్రజలు అభిప్రాయపడ్డారు.

అల్లీపూర్ క్రీడాకారిణి ప్రతిభ

- రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో వెండి పతకం



రాష్ట్ర అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రటరీ సారంగపాణితో సుచిత్ర, కోచ్ నవీన్‌లు

చిన్నచింతకుంట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగ ర్ జిల్లా, చిన్నచింతకుంట మండలంలోని అల్లిపూర్ గ్రామానికి చెందిన సుచిత్ర రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటుకున్నది. రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనగాం జి ల్లా, ధర్మకాంచ మినీ స్టేడియంలో ఈ నెల 7వ తేదీన అథ్లెటిక్స్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ జూనియర్స్ బాలికల విభాగంలో సుచిత్ర స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో పాల్గొని రెండవ స్థానంలో నిలిచి, వెండి పతకాన్ని కైవసం చేసుకున్నది. అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి చేతుల మీదుగా మెడల్‌తో పాటు, ప్రశంసాపత్రాన్ని అందుకున్నది. ఆమెను అథ్లెటిక్స్ అసోసియేషన్ వనపర్తి జిల్లా కార్యదర్శి నందిమల్ల శ్రీకాంత్, కోచ్ నవీన్ అభినందించారు.

నకిలీ ధ్రువపత్రాలపై కఠిన చర్యలు

- ఆర్‌డీవో నవీన్



గండీడ్ తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ నవీన్

గండీడ్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : నకిలీ ధ్రువపత్రాలను సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో నవీన్ హెచ్చరించారు. మహబూబ్‌నగర్ జిల్లా, గండీడు మండలంలోని రెడ్డిపల్లికి చెందిన గొల్ల బీరయ్య నకిలీ ధ్రువపత్రాలతో బ్యాంకుల్లో పంట రుణం, బీమా సొమ్మును అక్రమంగా తీసుకున్నట్లు అదే గ్రామానికి చెందిన గొల్ల కృష్ణయ్య ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేశాడు. వారి ఆదేశం మేరకు ఆర్‌డీవో నవీన్, ఏడీఏ రాంపాల్, డీఏవో వెంకటేశ్, ఎల్‌డీఎం చంద్రశేఖర్‌లు కమిటీగా ఏర్పాటు శుక్రవారం గ్రామానికి చేరుకున్నారు. గొల్ల బీరయ్యతో పాటు బాధితులను విచారించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం నివేదికను కలెక్టర్‌కు పంపిస్తామని వారు తెలిపారు. వారి వెంట తహసీల్దార్ మల్లికార్జున్‌రావు, డీటీ మాధవి ఉన్నారు. అలాగే గొల్ల బీరయ్యను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. తప్పు చేసినట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు.

ఎల్‌ఈడీ టీవీ చోరీ

వనపర్తి రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : అర్బన్ హెల్త్ సెంటర్‌లోని ఎల్‌ఈడీ టీవీని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. టౌన్ ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గురువారం రాత్రి వనపర్తి జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ తలుపులను గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. దాదాపు రూ.45 వేల విలువైన ఎల్‌ఈడీ టీవీని ఎత్తుకెళ్లిపోయారు. సంఘటనపై హెల్త్ సెంటర్ నిర్వాహకురాలు విజయలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు టౌన్ ఎస్‌ఐ తెలిపారు.

రెండు రోడ్డు ప్రమాదాల్లో

11 మందికి గాయాలు

అలంపూర్ చౌరస్తా, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు శివారులోని 44వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రెండు ప్రమాదాల్లో 11 మంది గాయపడ్డారు. మియాపూర్ అర్టీసీ డిపోకు చెందిన లహరి బస్సు 35 మంది ప్రయాణికులతో కడపకు వెళ్తోంది. అలంపూర్ చౌరస్తా సమీపంలోని ఉత్తరఫీడ్స్ సమీపంలో లారీని ఓవర్‌టేక్ చేస్తూ ముందు వెళ్తున్న కారును ఢీకొన్నది. దీంతో కారులో ఉన్న నలుగురు, బస్సు ప్రయాణికుల్లో ఐదుగురు స్వల్పంగా గాయపడ్డారు. అంతకుముందు హైదరాబాదు వైపు వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సు ముందు వెళ్తున్న వాహనం టోల్‌ప్లాజా సమీపంలో హఠాత్తుగా యూటర్న్ తీసుకోవడంతో బస్సు తప్పించుకునే క్రమంలో పక్కనే ఆగి ఉన్న డీసీఎంను ఢీకొన్నది. ప్రమాదంలో డీసీఎం డ్రైవర్‌తో పాటు, బస్సులోని వారిలో ఒకరికి గాయలయ్యాయి.

క్రైం కార్నర్

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి


కొమిరే శివకృష్ణ (ఫైల్)

కోడేరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కోడేరు మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన కొమిరే శివకృష్ణ(28) శుక్రవారం ఉదయం 3 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై హైదరాబాద్ నుంచి కోడేరుకు వస్తుండగా, జాతీయ రహదారిపై కర్తాల్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. రక్తపు మడుగులో పడి ఉన్న అతడిని వాహనదారులు గమనించి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి, కల్వకుర్తి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. శివకృష్ణకు భార్య శైలజ, ఒక కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం ఆమె నిండు గర్భిణి. బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి, ఆటో యూనియన్ నాయకులు పరామర్శించారు.

అడ్డాకుల స్నేహ చికెన్ పరిశ్రమ వద్ద మరొకరు..

మూసాపేట, (ఆంధ్రజ్యోతి) : కాలినడకన వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం రాత్రి 44వ జాతీయ రహదారిపై అడ్డాకులలోని స్నేహ చికెన్ పరిశ్రమ ఎదుట జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం... దేవరకద్ర మండలం బస్వాయిపల్లికి చెందిన దగ్గుల యాదగిరి (45) గురువారం రాత్రి నడుచుకుంటూ వెళ్తుండగా, కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతుడి షర్టు జేబులో ఉన్న ఆధార్‌కార్డు, ఓటరు గుర్తింపు కార్డులను పరిశీలించి, బస్వాయిపల్లి గ్రామస్థుడిగా గుర్తించారు. మృతదేహన్ని జిల్లా అసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయంలో హుండీ చోరీ


దేవాలయంలో జరిగిన దొంగతనంపై విచారణ చేస్తున్న పోలీసులు

పెద్దమందడి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, పెద్దమందడి మండలంలోని చౌదర్‌పల్లి అంజనేయ స్వామి ఆలయంలో హుండీ చోరీకి గురయ్యింది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మణిగిల్ల గ్రామం మధ్యలో ఉన్న చౌదర్‌పల్లి అంజనేయస్వామి ఆలయంలో గురువారం రాత్రి ఇద్దరు దొంగలు ప్రవేశించి, హుండీని ఎత్తుకెళ్లారు. దానిని జగత్‌పల్లి వాగులో పడేసి వెళ్లిపోయారు. ఆలయంలోని సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించి, నిందితులను గుర్తిస్తామని సీఐ రాంబాబు, ఎస్ఐ శివకుమార్ తెలిపారు. పురోహితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

పట్టపగలు రెండిళ్లలో చోరీ

- రూ.2.50 లక్షలు మాయం


చోరీ జరిగిన ఇంట్లో తెరిచి ఉన్న బీరువాను పరిశీలిస్తున్న ఎస్ఐ

గద్వాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండల పరిధిలోని జమ్మిచేడు గ్రామంలో శుక్రవారం పట్టపగలు రెండిళ్లలో చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బీసన్న, అంజనేయులు కుటుంబ సభ్యులు పనికి వెళ్లారు. బీసన్న టీ తాగేందుకు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాడు. గంట తర్వాత తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం విరగ్గొట్టి ఉండటంతో ఆందోళనకు గురయ్యాడు. లోనికి వెళ్లి చూడగా, బీరువా తలుపులు తెరిచి ఉండగా, అందులోని రూ.2లక్షల నగదు మాయం అయ్యింది. అయితే ఆయన తల్లికి సంబంధించిన రూ.80 వేలు, 2 తులాల బంగారు నగలు చీరల మధ్యన దాచి ఉంచడంతో అవి దొంగల కంట పడలేదు. అదే సమయంలో దొంగలు అంజనేయులు ఇంటి తాళాన్ని కూడా విరగ్గొట్టి, రూ.50 వేలు ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం సభ్యులు ఆధారాలను సేకరించారు. బాధితులు ఫిర్యాదు చేయగానే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

పిడుగు పాటుతో పశువుల మృతి


గట్టు రాయిపాకులలో పిడుగుపాటుతో మృతి చెందిన పశువులు

తెలకపల్లి/ మాగనూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో పిడుగు పాటుకు పశువులు మృతి చెందాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండలంలోని గట్టు రాయిపాకుల గ్రామానికి చెందిన రైతు మశన్న గురువారం రాత్రి తన పొలంలో కోడె, ఆవులను చెట్టుకు కట్టేసి ఇంటికి వచ్చారు. అదే రోజు రాత్రి భారీ వర్షం కురిసి, పిడుగు పడటంతో రెండు పశువులు అక్కడికక్కడే చనిపోయాయి. వాటి విలువ లక్ష రూపాయలు ఉంటుందని బాధితుడు తెలిపారు. అలాగే నారాయణపేట జిల్లా, మాగనూరు మండలం వడ్వాటు గ్రామానికి చెందిన రైతు కురువ పెద్ద బాలప్ప ఎద్దు కూడా పిడుగు పాటుతో చనిపోయింది. ఆయన గురువారం రాత్రి తన పొలం వద్ద చెట్టుకు ఎద్దులను కట్టేసి ఇంటికి వచ్చాడు. అదే రోజు రాత్రి భారీ వర్షం కురిసి, పిడుగులు పడ్డాయి. దీంతో ఓ ఎద్దు చనిపోయింది. దాని విలువ లక్ష రూపాయలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

ఎత్తిపోతల పైపులైన్ ధ్వంసం

పెంట్లవెల్లి (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, పెంట్లవెల్లి మండల పరిధిలోని మల్లేశ్వరం గ్రామంలోని వేంకల్ మినీ ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ గురువారం రాత్రి పిడుగుపాటుకు ధ్వంసమైంది. మండలంలోని యంగంపల్లి తండా, మల్లేశ్వరం గ్రామాల పరిధిలోని ఆయకటుకు సాగునీరు అందించేందుకు 1994 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం ఈ ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసింది. బ్రిడ్జి, పైపులైన్ ఏర్పాటు చేశారు కానీ, మిగిలిన పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. గురువారం రాత్రి పిడుగు పడటంతో బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన పైపులైన్ పూర్తిగా ధ్వంసం అయ్యింది.

యువతి అదృశ్యం

వనపర్తి రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, గోపాల్‌పేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైంది. వనపర్తి పట్టణ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆ యువతి వనపర్తి పట్టణంలోని తన బంధువుల ఇంట్లో ఉండి చదువుకుంటోంది. శుక్రవారం ఉదయం యువతి కనిపించకుండా పోవడంతో ఆమె తల్లికి ఫోన్ చేసి సమాచారం అందించింది. ఆమె బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు టౌన్ ఎస్ఐ తెలిపారు.

డేంజర్ డెంగీ



- రోజురోజుకూ పెరుగుతున్న బాధితుల సంఖ్య
- జనవరి నుంచి ఇప్పటి వరకు 97 కేసులు
- పట్టణ ప్రాంతాల్లోనే అత్యధికంగా వ్యాప్తి
- ఆందోళన చెందుతున్న పాలమూరు ప్రజలు


జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డెంగీ బాధితులు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలో డెంగీ వ్యాధి డేంజర్ బెల్స్ మోగిస్తోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో దోమల బెడద అధికమయ్యింది. ప్రధానంగా పగటి సమయంలో కుట్టే టైగర్ దోమతో డెంగీ బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 97 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. గత రెండు నెలల్లోనే 44 కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువ మంది డెంగీ బారిన పడుతున్నారు.

పగటి పూట కుట్టే టైగర్ దోమ

టైగర్ దోమ కుట్టడం వల్ల డెంగీ వ్యాధి వ్యాపిస్తుంది. పగటి వేళ కుట్టే ఈ దోమలు చాలా ప్రమాదకరమైనవి. ఇది కుట్టడంతో డెంగీ జ్వరం, డెంగీ హెమరైజ్డ్, డెంగీ షాక్ సిండ్రమ్ వంటి వైరస్‌లు శరీరంలో చేరతాయి. ఫలితంగా మనిషి శరీరం ఎర్రగా కందిపోవడం, కీళ్లు, కండరాలు, ఒళ్లు నొప్పులు అధికం అవుతాయి. కళ్లు మంటతో మూతలు పడతాయి. వాంతులు కూడా అవుతాయి. ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది.

జిల్లా కేంద్రంలోనే అధికం

జిల్లాలో డెంగీ వ్యాధి బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి జూలై 31 వరకు జిల్లాలో 97 డెంగీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అందులో జూన్, జులై రెండు నెలల్లోనే 44 కేసులు నమోదయ్యాయి. అవి కూడా పట్టణ ప్రాంతాల్లోనే అధికంగా ఉన్నాయి. ప్రధానంగా మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోనే అత్యధికంగా 17 కేసులు నమోదయ్యాయి. నగరంలోని పాత పాలమూరు, మర్లు, మోతినగర్, వేపూరిగేరి, వీరన్నపేట, షాషాబ్‌గుట్ట ప్రాంతాలతో పాటు జిల్లా కేంద్రం సమీపంలోని తిమ్మసానిపల్లి, జమిస్తాపూర్, బండమీదిపల్లి, ధర్మాపూర్, క్రిస్టియన్‌పల్లి గ్రామాల్లో ఈ వ్యాధి వేగంగా వ్యాపిస్తోంది. ఈ గ్రామాలతో పాటు నవాబ్‌పేట, జడ్చర్ల, భూత్పూర్, హన్వాడ, దేవరకద్ర, సీసీ కుంట మండలాల్లోనూ వ్యాధి విస్తరిస్తోంది. ఇళ్ల మధ్యనున్న ఖాళీ ప్లాట్లలో విపరీతంగా చెట్లు పెరిగి, మురుగునీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఆ ఖాళీ ప్లాట్లలో చెత్తా చెదారాన్ని తొలగించడం లేదు. యజమానులకు నోటీసులు జారీ చేసి, జరిమానాలు విధించడం వంటి చర్యలు తీసుకుంటే కొంతైనా మార్పు వచ్చే అవకాశం ఉంది.

శాఖల మధ్య సమన్వయలోపం

పారిశుధ్య నిర్వహణను వైద్య, ఆరోగ్య శాఖ, మునిసిపల్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో చేపట్టాల్సి ఉంటుంది. వర్షాకాలానికి వారం రోజుల ముందే సమావేశం ఏర్పాటు చేసుకొని తగిన ప్రణాళికను రూపొందించుకోవాల్సి ఉంది. డ్రైనేజీల శుభ్రత, పైప్‌లైన్ల లీకేజీల మరమ్మతులు ఎక్కడెక్కడ అవసరమో నివేదికలు తెప్పించుకొని పనులు చేపట్టాల్సి ఉంటుంది. వ్యాధులు ప్రబలే అవకాశమున్న ప్రాంతాలను ముందే గుర్తించి దోమల నివారణకు పైరెత్రమ్ స్ప్రే, డీటీడీ పౌడర్ చల్లాల్సి ఉంటుంది. మలేరియా, డెంగీ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది. కాని ఆయా శాఖల సమన్వయ లోపంతో పారిశుధ్య పనులు సక్రమంగా సాగడం లేదన్న ఆరోపణలున్నాయి. ఎవరికి వారు తమకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తుండటంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు.

ప్రజల్లో చైతన్యం రావాలి



నిల్వ ఉన్న నీటిలో లార్వా పెరిగి దోమలు వృద్ధి చెందుతాయి. దీంతో డెంగీ వ్యాధి ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ విషయంపై ప్రజలు చైతన్యవంతులు కావలసిన అవసరం ఉంది. తమ శాఖ ఆధ్వర్యంలో ప్రతీ గ్రామంలో జ్వరపీడితుల సర్వే చేస్తున్నాం. అనుమానిత కేసులు ఉంటే బాధితుల నుంచి రక్తపూతలు సేకరిస్తున్నాం. డెంగీ పాజిటివ్ కేసు నమోదైన ఇంటి చుట్టు 60 ఇళ్లల్లో పైరత్రమ్ స్ప్రే, మాలథియాన్‌తో ఫాగింగ్ కూడా చేయిస్తున్నాం. ప్రతీ శుక్రవారం డ్రై డే నిర్వహిస్తున్నాం. డెంగీ వ్యాప్తి నివారణపై విస్తృత ప్రచారం చేయిస్తున్నాం.

– డాక్టర్ కృష్ణ,
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి.


డెంగీ కేసు వచ్చిన ఇంటిలో అవగాహన కల్పిస్తున్న ఆశా వర్కర్లు (ఫైల్)

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు


కురుమూర్తి స్వామి ఆలయంలో నిర్వహించిన పవిత్రోత్సవాల్లో పాల్గొన్న ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, అర్చకులు, సిబ్బంది

- కురుమూర్తి స్వామికి ప్రత్యేక పూజలు
- మార్మోగిన గోవింద నామస్మరణ


పూజలందుకున్న కురుమూర్తి స్వామి

చిన్నచింతకుంట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా, చిన్నచింతకుంట మండలం, అమ్మాపూర్ సమీపంలోనున్న కురుమూర్తి స్వామి ఆలయంలో శుక్రవారం పవిత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని వేద పండితులు, అర్చకులు స్వామి వారికి పంచామృతాభిషేకం చేశారు. ద్వారపాలకులు, ఆల్వార్లకు అభిషేకాల అనంతరం స్వామిని పవిత్ర మాలలతో అలంకరించారు. అనంతరం యాగశాలలో హోమం నిర్వహించారు. కార్యక్రమంలో పాలక మండలి చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, అర్చకులు వెంకటయ్య, బత్తుల బాలరాజు, సత్యనారాయణ, అనంత విజయ్, శ్రీనివాసులు, పాలక మండలి సభ్యులు భాస్కరాచారి, నాగరాజు, బాదం వెంకటేశ్వర్లు, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతలకు వ్యతిరేకం కాదు

- న్యాయమైన పరిహారం ఇవ్వాలి
- నిర్వాసితుల సంఘం గౌరవ అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి



ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భూ నిర్వాసితుల సంఘం గౌరవ అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి

నారాయణపేట టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకానికి తాము వ్యతిరేకం కాదని భూ నిర్వాసితుల సంఘం గౌరవ అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి స్పష్టం చేశారు. ఈ పథకం కింద భూములు కోల్పోతున్న వారికి న్యాయమైన, ఆమోదయోగ్యమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నారాయణపేట పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భూ నిర్వాసితుల సంఘం అధ్యక్షుడు మశ్చేందర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. భూములు కోల్పోతున్న రైతులకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం ఎకరానికి రూ. 30 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. నిర్వాసితులు చేపట్టిన రిలే దీక్షలు 25వ రోజుకు చేరినా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రి వాకిటి శ్రీహరి, స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి తక్షణమే స్పందించి, పరిహారంపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం, భూ నిర్వాసితుల సంఘం ఉపాధ్యక్షుడు ధర్మరాజు పాల్గొన్నారు.

ఘనంగా తిరుపతిరెడ్డి జన్మదినం


కోస్గి శివాజీ చౌరస్తాలో తిరుపతి రెడ్డి జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

కోస్గి రూరల్/ మద్దూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతిరెడ్డి జన్మదినాన్ని పార్టీ కోస్గి మండల నాయకులు స్థానిక శివాజీ చౌరస్తాలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కేక్ కట్ చేసి ఒకరికొకరు పంచుకున్నారు. కార్యకర్తలకు అండగా ఉంటూ ఈ ప్రాంత అభివృద్ధికి తిరుపతిరెడ్డి చేస్తున్న సేవలను నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ వార్ల విజయ్ కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు తూం భీమ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, నాయకులు అన్నకిష్టప్ప, నరేందర్, బెజ్జురాములు, మహేందర్‌గౌడ్, ప్రభాకర్, హరి తదితరులున్నారు. అదేవిధంగా, గుండుమాల్‌లోని శివాజీ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేశారు.

మద్దూర్, కొత్తపల్లి మండలాల్లో తిరుపతిరెడ్డి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేశారు. మద్దూర్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ భీములు, పీఏసీఎస్ అధ్యక్షుడు నర్సింహ, రఘుపతిరెడ్డి, కొత్తపల్లి మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, చెన్నప్ప, విజయ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

కోళ్లఫారాలు పెట్టొద్దు

- పోతేపల్లి వద్ద గ్రామస్థుల రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

వెల్దండ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : తమ గ్రామాలకు సమీపంలో కోళ్లఫారాలు ఏర్పాటు చేయొద్దంటూ స్థానికులు ఆందోళన చేపట్టారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి, వెల్దండ గ్రామాల మధ్య కొందరు 60 ఎకరాల భూమిని కొనుగోలు చేసి కోళ్ల ఫారాలు పెట్టేందుకు సిద్ధం అయ్యారు. దీంతో చుట్టుపక్కల గ్రామాలు పోతేపల్లి, లింగారెడ్డిపల్లి, తాండ్రలకు చెందిన గ్రామస్థులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. తమ గ్రామాల సమీపంలో కోళ్ల ఫారాలు ఏర్పాటు చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. దుర్వాసనతో పాటు, ఈగలు, దోమల బెడదతో ప్రజలు అనారోగ్యం బారిన పడ్తారని ఆందోళన వ్యక్తం చేశారు. కోళ్లఫారాల ఏర్పాటు ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాస్తారోకోలో నాయకులు సంజీవ్‌కుమార్, రాజశేఖర్, సాయిరెడ్డి, ఈశ్వరయ్య, అలీ తదితరులు పాల్గొన్నారు.

జోగుళాంబ సన్నిధిలో న్యాయమూర్తి


ఆలయం ముందు హైకోర్ట్ న్యాయమూర్తి రేణుక యార, కుటుంబ సభ్యులు

అలంపూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్ క్షేత్రాన్ని రాష్ట్ర హైకోర్ట్ న్యాయమూర్తి రేణుక యార శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో గణపతి పూజ, అభిషేకం చేయించారు. జోగుళాంబ అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన తదితర విశేష పూజలు చేయించారు. వారి వెంట అలంపూర్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి మిథున్ తేజ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

చిరుత పులా? హైనా?

- కొత్తపాలెంలో వరుస సంఘటనలు
- గురువారం ఆవుదూడ, శుక్రవారం కోడె మృతి


కొత్తపాలెం గ్రామంలో చిరుత ఆనవాళ్లతో ఉన్న గుర్తులు

ధరూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ధరూరు మండల పరిధిలోని కొత్తపాలెంలో వరుస సంఘటనలు ఆందోళన కలిస్తున్నాయి. గ్రామంలో గురువారం ఒక ఆవు దూడ, శుక్రవారం ఓ కాడెద్దు అడవి జంతువు దాడిలో చనిపోయాయి. వాటిని చంపింది చిరుత పులా? హైనానా? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గ్రామానికి చెందిన రైతు వెంకటప్ప బుధవారం రాత్రి తన పొలం వద్ద గేదెలు, ఆవులు, ఎద్దులతో పాటు కాడెద్దులను కట్టేసి ఇంటికి వచ్చాడు. గురువారం ఉదయం వెళ్లి చూడగా ఒక ఆవు దూడ చనిపోయి ఉంది. అదే విధంగా శుక్రవారం ఉదయం వెళ్లి చూడగా, అక్కడే కట్టేసిన కోడె దూడ చనిపోయి కనిపించింది. దాన్ని గుర్తు తెలియని జంతువు చంపి తిన్నట్లు ఆనవాళ్లున్నాయి. సమాచారం అందుకున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సర్వేశ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. ఈ విషయంపై ఆయనను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, సంఘటనా స్థలంలో చిరుత పులి ఆనవాళ్లు కనిపిస్తున్నాయన్నారు. ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తామని తెలిపారు. పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని, పుటేజీలను పరిశీలిస్తే అది చిరుత పులా, హైనానా తెలుస్తుందని అన్నారు. రైతులు, గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

హత్యకేసులో నిందితులకు రిమాండ్

వెల్దండ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం జరిగిన బెల్లంకొండ రాములు హత్య కేసులో నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని సీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన ఎస్ఐ కురుమూర్తితో కలిసి విలేకరులతో మాట్లాడారు. కల్వకుర్తి వాసి రాములుకు చెందిన పందులు ఇటీవల చోరీకి గురయ్యాయని తెలిపారు. వాటిని కల్వకుర్తికి చెందిన మానుపాటి వెంకటమ్మ చోరీ చేసి, వెల్దండ సమీపంలోని సాయిలు పొలంవద్ద ఉంచారని బాధితులు గుర్తించారు. వాటిని తీసుకెళ్లేందుకు ఈనెల 6న రాములు తన అనుచరులతో కలిసి అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో వారి మధ్య ఘర్షణ చెలరేగింది. వెంకటమ్మ, ఆమె అత్త పెంటమ్మ, కుమారులు అన్వేశ్, శివ, పవన్‌లు కర్రలు, కత్తులతో దాడి చేయడంతో రాములు మృతి చెందాడు. అతడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితురాలు పెంటమ్మ పరారీలో ఉండగా, మిగిలిన వారిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



న్యూస్ బాక్స్

బాధిత కుటుంబానికి పరామర్శ

దేవరకద్ర, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కొండ గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తల్లి సత్యమ్మ గురువారం సాయంత్రం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్ శుక్రవారం ఆమె మృత దేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దేవరకద్ర, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కృష్ణయ్య అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కోయిల్‌సాగర్ ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరడంతో ప్రాజెక్టు నిండే అవకాశం ఉందని, రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు.

ఎలక్ట్రీషియన్ కమిటీ ఎన్నిక

గండీడ్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెన్నాచేడ్, జక్లపల్లి, లింగాయిపల్లి గ్రామాలకు చెందిన ఎలక్ట్రీషియన్లు యూనియన్‌గా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా శంకర్, ఉపాధ్యక్షుడిగా హన్మంతు, ప్రధాన కార్యదర్శిగా గురునాథ్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

తల్లిపాలే బిడ్డకు వరం

నవాబ్‌పేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : తల్లిపాలే బిడ్డకు వరమని ఎంపీడీవో జయరాములు పేర్కొన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి పీహెచ్‌సీ వైద్యురాలు తేజశ్రీతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్న ప్రాశన చేశారు. సూపర్‌వైజర్ రాజరాజేశ్వరి శ్రీనివాసులు, రాములు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మిడ్జిల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లాపూర్‌కు చెందిన విభూతి రంగమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, బీఆర్ఎస్ నాయకుడు జంగారెడ్డి, టీపీసీసీ కో-ఆర్డినేటర్ మధు వేర్వేరుగా శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు లింగంగౌడ్, బంగారు, వెంకటస్వామి, దశరథచారి, చెన్నయ్య, పోషయ్య, అంజనేయులు, రాములు పాల్గొన్నారు.

పాఠశాలల గదులు నేల మట్టం



నేల మట్టమైన పాఠశాల గదులు

నవాబ్‌పేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : 'పాఠశాలల గదులు పదిలమేనా' అనే శీర్షికతో జూలై 31న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఎట్టకేలకు అధికారులు స్పందించారు. శిథిలావస్థకు చేరిన మండలంలోని కేశవరావ్‌పల్లి ప్రభుత్వ పాఠశాల గదులను శుక్రవారం ఎంపీడీవో జయరాములు ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్ సహాయంతో నేల మట్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో శిథిలావస్థకు చేరిన అన్ని పాఠశాల గదులను తొలగిస్తామని తెలిపారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి

హన్వాడ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొండ లింగన్న అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తపేటలో పార్టీ మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి మోదీ చేపట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. నాయకులు చెన్నప్ప, మల్లేష్, రంగస్వామి, చిన్న రవి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అనుమతి లేని భవనంపై చర్యలు తీసుకోవాలి

జడ్చర్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీలో బోయిలకుంట్లకు వెళ్లే దారిలో సుమారు రెండు వేల గజాల్లో అనుమతి లేకుండా మూడు అంతస్థుల భవనం నిర్మించారని, దీంతో మునిసిపాలిటీకి రూ.20 నుంచి రూ.25 లక్షల మేర ఆదాయం నష్టం జరగిందన్నారు. ఈ భవనంపై చర్యలు తీసుకోవాలంటూ హైదరాబాద్‌లోని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ శ్రీదేవికి జడ్చర్ల మునిసిపల్ కౌన్సిలర్ శశికిరణ్ ఫిర్యాదు చేశాడు. ఈ అంశంపై కౌన్సిల్ సమావేశంలో పలు పర్యాయాలు మునిసిపల్ కమిషనర్, అదనపు కలెక్టర్, కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ భవనానికి ఇంటి నెంబరు కేటాయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ అంశంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఓటరు సవరణ జాబితాను వ్యతిరేకించాలి

పాలమూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఓటరు సవరణ జాబితాను వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీపీఎం కేంద్ర కమిటీ పిలుపుమేరకు చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడుతూ బీహార్ రాష్ట్రంలో ఓటరు సవరణ జాబితాకు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. బీహార్‌లో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అర్హులైన 65 లక్షల మంది ఓటర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడాన్ని వ్యతిరేకించాలన్నారు. బీజేపీ విధానాలను దేశమంతా ఖండించాలన్నారు. చంద్రకాంత్, రాజ్,మోహన్, ఆదివిష్ణు, విజయ్, భాస్కర్, దిలీప్, సురేష్ పాల్గొన్నారు.



జడ్చర్ల రేణుక ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు




అడ్డాకుల, వెన్నచేడ్ గ్రామాల్లో వరలక్ష్మి వ్రతాలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం

- రేణుక ఎల్లమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు
- ఆలయాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు



రాజాపూర్ హనుమాన్ ఆలయంలో..



మహబూబ్‌నగర్‌లో..



ఎల్లమ్మకు పూజలు చేస్తున్న భక్తురాలు

మహబూబ్‌నగర్ న్యూ టౌన్/ జడ్చర్ల/గండీడ్/రాజాపూర్/దేవరకద్ర/మూసాపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు ఆలయాల్లో శుక్రవారం వరలక్ష్మి వ్రతాలను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజామునే మామిడి తోరణాలు కట్టి ఇంట్లో లక్ష్మీదేవిని పూజించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలోని రేణుక ఎల్లమ్మ ఆలయం, నెలగంట స్వామి ఆలయం, శ్రీనివాసకాలనీ, భగీరథకాలనీ, బ్రహ్మణవాడీలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని ఆలయ పూజారులు సుందరంగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని నిర్వహించిన సామూహిక వరలక్ష్మి వ్రతాలలో భక్తులు పాల్గొన్నారు. లలిత సహస్ర పారాయణం చేశారు. జడ్చర్ల పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం, శ్రీసకలదేవతల ఆలయం, సరస్వతి శిశు మందిరం, రేణుక ఎల్లమ్మ ఆలయంలో వరలక్ష్మి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరించి, గణపతిపూజ, అభిషేకం, పంచామృత అభిషేకం, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం దీపారాధన చేపట్టారు. అదే విధంగా గండీడ్ మండల కేంద్రంతో పాటు రుసుంపల్లి, పగిడ్యాల్, వెన్నాచేడ్ గ్రామాల్లోని ఆయా ఆలయాల్లో మహిళలు సామూహిక వరలక్ష్మి పూజలు చేశారు. రాజాపూర్ మండల కేంద్రంలోని హనుమన్ ఆలయంలో మహిళలు సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు. దేవరకద్ర మండల కేంద్రంలోని వాసవీమాత ఆలయంలో ఆర్యవైశ్య మహిళలు సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. అడ్డాకుల మండల కేంద్రంలోని శివాంజనేయస్వామి ఆలయంలో మహిళలు కుంకుమార్చన నిర్వహించారు.

పారుతున్న దుందుభీ



పాక్షికంగా తెగిపోయిన గోపన్నపల్లి రోడ్డు

జడ్చర్ల/రాజాపూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలంలో దుందుభీ నది పారుతోంది. గురువారం కురిసిన భారీ వర్షానికి కోడ్గల్ వద్ద సుమారు 2 ఫీట్ల మేర నది పారడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా మండలంలోని నసరుల్లాబాద్ చెరువు అలుగు పారుతోంది. ఇదిలా ఉండగా జడ్చర్లలో గురువారం 123.8 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రాజాపూర్ మండలంలోని నందిగామ, మల్లేపల్లి గ్రామాల మధ్య ఉన్న చెక్‌డ్యామ్‌లు నిండి పారడంతో ఆయా గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని ముదిరెడ్డిపల్లి నుంచి నందిగామ, జడ్చర్ల మండలంలోని ఈర్లపల్లి, కోడ్గల్ గ్రామాలకు వెళ్లే మార్గంలోని స్థానిక రైల్వే అండర్ బ్రిడ్జి కింద వర్షపు నీరు నిల్వడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు

భూత్పూర్/మూసాపేట : భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. గురువారం రాత్రి 66.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, పత్తి, వరి, ఆముదం, కంది, జొన్న, మొక్కజొన్న పంటలకు మేలు చేకూరిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గోపన్నపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు డ్యాము పాక్షికంగా తెగిపోయింది. దీంతో గ్రామానికి వెళ్లాలంటే వాహనదారులు భయపడుతున్నారు. భారీ వర్షానికి రోడ్ డ్యామ్ పూర్తిగా కూలిపోయే స్థితిలో ఉందని, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని పోతులమడుగు మాజీ సర్పంచ్ సత్యనారాయణ కోరారు. అడ్డాకుల, మూసాపేట ఉమ్మడి మండలాల్లో పెద్దవాగులో నీటి వరద ఉధృత్తి పెరగడంతో నిజాలాపూర్, గౌరిదేవునిపల్లి, కందూరు వద్ద చెక్‌డ్యామ్‌లు నీటితో నిండి అలుగులు పారుతున్నాయి.



జడ్చర్ల మండలం కోడ్గల్‌లో పారుతున్న దుందుభీ నది

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

మహమ్మదాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పేదల అభ్యున్నతికి కృషి చేస్తోందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో 22 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కేఎం నారాయణ, డీసీసీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

మహమ్మదాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) :విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన ఘటన మండలంలోని జూలపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. రైతు గొల్ల దశరథ కథనం ప్రకారం.. పొలంలో మేత మేస్తుండగా గాలివానకు విద్యుత్ వైర్ తెగి పడటంతో విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందినట్లు తెలిపారు. దీని విలువ రూ.80 వేలు ఉంటుందన్నారు.

రెండు ఇసుక టిప్పర్ల పట్టివేత

రాజాపూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివానందం తెలిపారు. రాజాపూర్‌లోని జాతీయ రహదారిపై తనిఖీ చేస్తుండగా అనుమతి లేకుండా నారాయణపేట జిల్లా నుంచి ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గొర్రెలు అపహరణ : కేసు నమోదు

గండీడ్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వ్యక్తులు గొర్రెల మంద నుంచి 40 గొర్రెలు ఎత్తుకెళ్లిన సంఘటన గండీడ్ మండలం వెన్నాచేడ్, కొంరెడ్డిపల్లి గ్రామాల శివారులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ శేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. వెన్నాచేడ్ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి చిలకల అంజిలయ్య గురువారం రాత్రి 10 గంటలకు గొర్రెలను నిలిపి తిని కొద్ది సేపు నిద్రపోయాడు. రాత్రి 2 గంటలకు గొర్రెల మంద దగ్గరకు వెళ్లి చూడగా మందలో 40 గొర్రెలు కనబడలేవు. కొంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బుడ్డయ్య, మల్లయ్య, డీ.మల్లయ్య ఒకే దగ్గర గొర్రెలు మేపుతూ గత నెల 31న 600 గొర్రెలను ఒకే దగ్గర నిలిపి ఓ వ్యక్తిని కాపాలా పెట్టి ఇంటికి వెళ్లగా.. 38 గొర్రెలు కనబడకపోవడంతో శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వాలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయని ఎస్ఎఫ్ఐ నాయకుడు కురుమూర్తి, జిల్లా కార్యదర్శి భరత్ అన్నారు. విద్యారంగ సమస్యలపై ఈనెల 4 చేపట్టిన జీపు యాత్ర శుక్రవారంతో ముగియగా, ముగింపు సభను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని పట్టించుకోవడంలో విఫలమయ్యారని ఆరోపించారు. జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్, శ్రీనాథ్ , కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పండుగ సాయన్నకు ఘన నివాళి



జడ్చర్లలో పండుగ సాయన్న చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

జడ్చర్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : పండుగ సాయన్న జయంతిని శుక్రవారం జడ్చర్ల మునిసిపాలిటీలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కావేరమ్మపేటలో పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ లక్ష్మీరవీందర్, గోవర్దన్, శంకర్, చంద్రమౌళి, శ్రీశైలం, వెంకటయ్య, కుమార్, చంద్రశేఖర్, నరేశ్, వంశీ పాల్గొన్నారు.

● మిడ్జిల్ : పాలమూరు జిల్లాకు పండుగ సాయన్న పేరు పెట్టాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి అన్నారు. పండుగ సాయన్న జయంతి సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

● గండీడ్ : ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు గోపాల్ ఆధ్వర్యంలో మండలంలోని వెన్నాచేడ్, కప్లాపూర్, గండీడ్ మండల కేంద్రాల్లో పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

● నవాబ్‌పేట : పండుగ సాయన్న ఆశన్న ఆశయాలు కొనసాగిద్దామని కొల్లూర్ గ్రామ అఖిల పక్ష నాయకులు అన్నారు. శుక్రవారం మండలంలోని కొల్లూర్‌లో ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు.

వర్షం నీటిని వదలట్లేదు

- వర్షం నీటిలో కాలుష్యాన్ని వదులుతున్న ఫార్మా పరిశ్రమలు
- లబోదిబోమంటున్న రైతులు



కాలుష్య నీటిని వర్షపు నీటిలో వదులుతున్న ఫార్మా పరిశ్రమ

జడ్చర్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : వర్షం పడిందంటే రైతులు సంతోషం వ్యక్తం చేస్తారు. భూ గర్భజలాలు పెరిగి బోర్లలో నీళ్ల పెరుగుతాయని పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తారు. రీసైక్లింగ్ చేసి, నిర్మానుష్య ప్రాంతంలో వదలాల్సిన కాలుష్యం నీటిని పైసా ఖర్చు లేకుండా వ్యవసాయ పొలాల్లోకి వదిలేస్తూ ఫార్మ పరిశ్రమల యాజమాన్యాలు సైతం సంతోషం వ్యక్తం చేస్తాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వర్షం నీటితో పాటు కాలుష్యం నీటిని మండలంలోని పోలేపల్లి సెజ్‌లోని కొన్ని ఫార్మ పరిశ్రమలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పైపులైనులో నుంచి వ్యవసాయ పొలాల్లోకి వదులుతున్నారు. పోలేపల్లి సెజ్ పరిసరాల్లో పోలేపల్లి రైతులతో పాటు రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లి, రాయపల్లి గ్రామాల రైతుల వ్యవసాయ పొలాలు ఉన్నాయి. అలాగే గుండ్లగడ్డతండా సమీపంలో పెద్దకుంట, ముదిరెడ్డిపల్లి సమీపంలో చెరువులు సైతం ఉన్నాయి. సెజ్‌లోని ఫార్మ పరిశ్రమల నుంచి కాలుష్యం నీటిని వదులుతుండడంతో పంటపొలాలు దెబ్బతిన్నాయని, పంటలు పూర్తిగా నష్టపోయామని, పరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలంటూ రైతులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అధికారుల బృందాన్ని ఏర్పాటు చేసి పోలేపల్లి సెజ్‌లోని ఫార్మ పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అధికారుల బృందం పర్యటించి వారం రోజులు కాకుండానే ప్రస్తుతం కురిసిన వర్షాలకు వర్షం నీటితో పాటు కాలుష్యం నీటిని వదులుతున్నారు. కొన్ని ఫార్మ పరిశ్రమలలో కాలుష్యం నీటిని స్టోరేజీ చేస్తున్న అంశాన్ని అధికారులు బృందం గుర్తించినా, ఆయా పరిశ్రమల యాజమాన్యాలు బాధ్యతా రహితంగా వ్యవహరిస్తున్నారు. వ్యవసాయ పొలాల పక్కనే ఉన్న అమ్నీల్, హెటెరో, అరబిందో, శిల్ప, మైలాన్ తదితర ఫార్మ పరిశ్రమల నుంచి యథేచ్ఛగా కాలుష్యం నీటిని వదులుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కాలుష్యం వెదజలుతున్న ఫార్మ పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

భారీ వర్షాలకు అధికార యంత్రాంగం అప్రమత్తం

- లోతట్టు, ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు జిల్లాలో మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో కార్పొరేషన్ పరిధిలో అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం రాత్రి భారీ వర్షం కురిసిందని, అయితే నగరంలో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి వర్షాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాలు, ముంపునకు గురయ్యే ప్రాంతాలపై ఇప్పటికే ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. నాలాలు, చెరువుల పక్కన నివాసముంటున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అలాంటి ప్రాంతాలను సిబ్బంది ఎప్పటికప్పు డు గమనిస్తూనే ఉందని, అవసరమైతే వారిని పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రస్తుతం పెద్ద చెరువులో నీటి మట్టం తక్కువగానే ఉందని, మరో రెండు భారీ వర్షాలు కురిసినా పెద్ద చెరువులోకి అవసరమైన వరదను మళ్లిస్తామని, పెద్దచెరువు కింద ఉన్న రామయ్యబౌళి, బీకేరెడ్డి కాలనీల్లో నివాసం ఉంటున్న ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. అధికారులంతా క్షేత్రస్థాయిలోనే ఉండాలని ఆదేశాలివ్వడం జరిగిందని, కాలనీలో ఇళ్ల మధ్య నీరు నిలిచినా, డ్రైనేజీలు పొంగిపొర్లినా అక్కడ నీటిని మళ్లించి వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ చేయాలని సిబ్బందికి డైరెక్షన్ ఇవ్వడం జరిగిందని కమిషనర్ వెల్లడించారు.

బీజేపీ బీసీల వ్యతిరేక పార్టీ



విలేకరుల సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

మహబూబ్‌నగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ బీసీల పట్ల వ్యతిరేకంగా ఉందని, మొదటినుంచి బీసీలంటే ఆ పార్టీకి గిట్టదని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. బీజేపీ అంటేనే బీసీలకు వ్యతిరేక పార్టీ అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్, ఎన్పీ వెంకటేశ్ మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మాణం చేసి రాష్ట్రపతికి పంపడంతో పాటు గవర్నర్‌కు ఆర్డినెన్స్ పంపించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు కేంద్రం నుంచి ఎలాంటి స్పందన లేదని, రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకుండా బీజేపీ నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. బీజేపీ 42 శాతం ఇవ్వకుండా అడ్డుకున్నా.. కాంగ్రెస్ మాత్రం పార్టీ పరంగా 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించడం జరిగిందన్నారు. రాహుల్‌గాంధీ చెప్పిన విధంగా సీఎం రేవంత్‌రెడ్డి కులగణన చేసి పంపించడం జరిగిందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌కు బీసీలంటే కేవలం ఓటు బ్యాంకు గానే వినియోగించుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ముందునుంచి బీసీల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తుందని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇచ్చామని గుర్తుచేశారు. నాయకులు మల్లు నరసింహారెడ్డి, సిరాజ్‌ఖాద్రి, చంద్రకుమార్‌గౌడ్, సీజె బెనహర్ పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డు పనులు వేగవంతం చేయాలి



ఘాట్‌రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

చిన్నచింతకుంట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : కురుమూర్తి గుట్టపైకి వెళ్లేందుకు కొనసాగుతున్న ఘాట్ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో గల కురుమూర్తి వేంకటేశ్వర స్వామి వారి జాతర మైదానంలో కొనసాగుతున్న ఘాట్‌రోడ్డు పనులు పరిశీలించి, మాట్లాడారు. భక్తుల సౌకర్యార్థం ఘాట్‌రోడ్డు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పనుల వేగం పెంచాలన్నారు. అలాగే షెడ్డు నిర్మాణం కూడా పూర్తి చేయాలన్నారు. నాయకులు అరవింద్ కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కురుమూర్తి ఆలయ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, దేవరకద్ర మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, ఆలయ పాలకవర్గం సభ్యులు భాస్కరాచారి, కమలాకర్, శ్రావణ్‌కుమార్, ఎస్ఐ రామ్‌లాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్

కోయిలకొండ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వీరభద్ర పాఠశాల, పారుపల్లి శేత్వ విద్యామందిర్, ఆర్ఎస్ఎస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రక్షాబంధన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఒకరికి ఒకరు రాఖీ కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

● భూత్పూర్: మునిసిపాలిటీ కేంద్రంలోని 9వ వార్డులోని సాహితి కాన్సెప్ట్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు రక్షా బంధన్ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తోటి విద్యార్థులకు రాఖీ కట్టి సోదరభావాన్ని చాటుకున్నారు. పాఠశాల కరెస్పాండెంట్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రాఖీ ఆకృతిలో విద్యార్థులు

ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి

జడ్చర్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల న్యూ బస్టాండును మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సంతోష్‌కుమార్ శుక్ర వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండు ప్రాంగణంలో ఉన్న దుకాణాలలో విక్రయిస్తున్న వస్తువులు, తినుబండారాలు పరిశీలించారు. ఎమ్మార్పీ ధరలకే విక్రయిస్తున్నారా? అని ఆరా తీశారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు సరికావు



ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవాబ్‌పేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, ఆయన సోదరుడు దుశ్యంత్‌రెడ్డిపై ఇటీవల కాంగ్రెస్ పార్టీకి చెందిన దారా భాస్కర్ సామాజిక మాధ్యమాల్లో నిత్యం అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, మార్కెట్ చైర్మన్ హరలింగం, మైసమ్మ ఆలయ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, వాసుయాదవ్, భూపాల్ కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఐ విక్రమ్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సురేందర్, సత్యం, నర్సింహులు, రవీందర్ రెడ్డి, సురేష్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు వస్తువులు అప్పగింత

జడ్చర్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : బస్సులో విలువైన వస్తువులు మరిచిన ప్రయాణికులకు తిరిగి అప్పగించిన సంఘటన శుక్రవారం జడ్చర్ల కొత్త బస్టాండులో చోటుచేసుకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. కర్నూల్‌కు చెందిన సాయివర్ష కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. కొత్తకోటలో బస్సు ఆగడంతో.. దిగి వచ్చేలోపే బస్సు వెళ్లిపోయింది. ల్యాప్‌టాప్, సర్టిఫికెట్స్ ఉన్నాయంటూ కొత్తకోట బస్టాండులోని ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. వెంటనే జడ్చర్ల కొత్త బస్టాండులోని కంట్రోలర్లు సమాచారం ఇవ్వడంతో వారు బస్సులో ఉన్న ల్యాప్‌టాప్‌తో పాటు సర్టిఫికెట్‌లు కలిగిన బ్యాగును స్వాధీనం చేసుకొని సదరు ప్రయాణికురాలికి అప్పగించారు. మరో సంఘటనలో కర్నాటక రాష్ట్రం రాయిచూర్ సమీపంలోని శక్తినగర్‌కు చెందిన కవిత శుక్రవారం శక్తినగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కింది. మహబూబ్‌నగర్‌లో బస్సు ఆగడంతో వాష్‌రూమ్‌కు వెళ్లి వచ్చేలోగా బస్సు బయలుదేరింది. బస్సులో బంగారు వస్తువులు, నగదు, సెల్‌ఫోన్ ఉన్నాయంటూ ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. వెంటనే జడ్చర్ల న్యూబస్టాండులోని ఆర్టీసీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో బస్సులో ఉన్న వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం జడ్చర్ల బస్టాండుకు వచ్చిన సదరు ప్రయాణీకురాలు కవితకు నగదు, బంగారు వస్తువులు, సెల్‌ఫోన్‌ను అప్పగించారు.